క్లుప్తంగా

వ్యాపారులకు జరిమానా విధింపు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక న్యూటౌన్ ప్రాంతంలోని వివిధ షాపులను, పుట్‌పాత్‌పై తోపుడుబండ్లను గురువారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ వాణికుమారి ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. మెయిన్ రోడ్డుపై చెత్తను వేస్తున్న పండ్ల వ్యాపారులకు, నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న ఓ హోటల్ నిర్వాహకుడికి రూ.1,500 జరిమానా విధించారు. అలాగే ఆ హోటల్‌లో వండిన వివిధ ఆహార పదార్థాలను పరిశీలించారు.

సుందరీకరణ పనులకు స్థల పరిశీలన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక రాజీవ్ సర్కిల్ నుంచి క్లాక్‌టవర్ వరకు త్వరలో సుందరీకరణ పనులు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా ఈ మార్గాన్ని 100 ఫీట్లకు విస్తరించనున్నారు. గురువారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులు ఈ రోడ్డుకు ఇరువైపులా ఆనుకుని ఉన్న చిరు వ్యాపారులకు పలు సూచనలు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు నిర్వహించొద్దని హెచ్చరించారు. అనంతరం ఎక్కడెక్కడ గ్రీనరీ ఏర్పాటు చేయాలో స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో టీపీఓ లక్ష్మీపతి, ఏఈ పృథ్వీ, మున్సిపల్ సిబ్బంది మంతటి యాదయ్య, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

దేవరకద్ర: మండలంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ సత్యయ్య ప్రకటనలో తెలిపారు. మరికల్ 132 కేవీ విద్యుత్ కేంద్రంలో మరమ్మతు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో మండలం అంతా విద్యుత్ సరాఫరా ఉండదని తెలిపారు.

26న హరితహారం

గండేడ్: ఈనెల 26న మండలంలో హరిత హారం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి వెన్నాచేడ్, పగిడ్యాల్ వరకు మొక్కలు నాటుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, స్థానికులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిక

మహమ్మదాబాద్: మండల కేంద్రానికి చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం మాజీ ఎమ్మెల్యే టీ.రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో చేవెళ్ల సమావేశంలో వారు పార్టీలో చేరినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ విజయ పథంలో నడిపించేందుకు కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సురేష్, తిరుమలేష్, రాజు, రవి, సాయికుమార్, వెంకట్ పాల్గొన్నారు.

బీసీలకు 65 సీట్లు కేటాయించాలి

జడ్చర్ల టౌన్: జనాభాలో సగభాగం ఉన్న బీసీలకు రాబోయే ఎన్నికల్లో ఒక్కో రాజకీయ పార్టీ 65 అసెంబ్లీ సీట్లు కేటాయించాలని బీసీసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ కేవలం 22 సీట్లు బీసీలకు ఇచ్చి ఓటు బ్యాంకుగానే చూస్తుందని తేలిపోయిందన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మహబూబ్‌నగర్ క్రైం: యువతతో పాటు విద్యార్థులు లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలని ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు అన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై గురువారం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలి

కోయిల్‌కొండ: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శివకుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించి, పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తామని మండల నాయకులు రవీందర్, విద్యాసాగర్‌గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాల్లో ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రజల చూపు కాంగ్రెస్ వైపు మళ్లిందన్నారు.

తరలిన నాయకులు

గండేడ్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 26న చేవెళ్లలో తలపెట్టిన దళిత డిక్లరేషన్ సభలో భాగంగా గురువారం వికారాబాద్ జిల్లా మన్నెగూడలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి మండలం నుంచి పెద్దఎత్తున కార్యకర్తలు తరలివెళ్లారు. నరసింహారావు, జితేందర్‌రెడ్డి, పుల్లారెడ్డి పలువురు ఉన్నారు.



బాలానగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



దేవరకద్రలో..

చంద్రయాన్ విజయోత్సవ ర్యాలీ

చంద్రయాన్–3 విజయవంతంపై జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు జాతీయ జెండాలతో భారీ ర్యాలీ చేపట్టారు. ఇందుకు కృషి చేసిన శాస్త్రవేత్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. భారత్ ఘన విజయం సాధించడం ఎంతో గర్వంగా ఉందని విద్యార్థులు ఉపన్యసించారు.

– సాక్షి, నెట్‌వర్క్



మహమ్మదాబాద్‌లో విజయోత్సవ ర్యాలీలో అధికారులు, విద్యార్థులు



అప్పంపల్లిలో భారీ జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



మిడ్జిల్‌లో..

సజావుగా సామాజిక తనిఖీ ప్రజావేదిక



సమీక్ష నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్, డీఆర్‌డీఓ యాదయ్య

జడ్చర్ల టౌన్: మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన 13వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక సజావుగా సాగింది. కార్యక్రమాన్ని జెడ్పీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య ప్రారంభించారు. 45 పంచాయతీలకు సంబంధించి 13నెలలుగా చేపట్టిన 945 పనులపై ప్రజావేదిక సాఫీగా కొనసాగించాలని తెలిపారు. అనంతరం స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్, డీఆర్‌డీఓ యాదయ్య, ఏపీడీ శ్రీపాద్ పంచాయతీల వారీగా సమీక్ష నిర్వహించారు. 850 పనులు చేపట్టగా కూలీ డబ్బులు, మెటీరియల్, అటవీశాఖ పరిధిలో చేపట్టిన రెండు పనులు కూలీ డబ్బులు, మెటీరియల్‌పై విచారణ చేశారు. పంచాయతీరాజ్ పరిధిలో 93 పనులు చేపట్టగా కూలీ డబ్బులు, మెటీరియల్‌గా సంబంధించి తనిఖీ బృందాలు గ్రామాల్లో పరిశీలించి నివేదిక తయారు చేశారు. ఆ నివేదికల ఆధారంగా ఒక్కో పంచాయతీ వారీగా సమీక్ష నిర్వహించారు. ఉదయం నిర్వహించిన గ్రామాల సమీక్షలో సర్పంచ్‌లు హాజరయ్యారు. పంచాయతీలు ఎక్కువగా ఉండటంతో డీఆర్‌డీఓ, ఏపీడీ వేర్వేరుగా సమీక్ష నిర్వహించాల్సి వచ్చింది. రాత్రి 7గంటల వరకు 38 పంచాయతీల సమీక్ష ముగిసింది. మిగిలిన 8 పంచాయతీలు సైతం ఇదే రాత్రి పూర్తిచేస్తామని డీఆర్‌డీఓ తెలియజేశారు. సామాజిక తనిఖీలో కొన్ని పంచాయతీల్లో జరిమానా వేయగా వాటి వివరాలు శుక్రవారం తెలియజేస్తామని ఎంపీడీఓ ఉమాదేవి తెలిపారు. సామాజిక తనిఖీలో ఎంపీఓ జగదీష్, ఏపీఓ విజయభాస్కర్, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త లక్ష్యంతో పనిచేయాలి



మాట్లాడుతున్న విజయేంద్ర యడ్యూరప్ప

నవాబుపేట: ప్రతి కార్యకర్త లక్ష్యంతో పనిచేయాలని బీజేపీ కర్ణాటక ఎమ్మెల్యే విజయేంద్ర యడ్యూరప్ప పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా పార్టీ మండల అధ్యక్షుడు రాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కార్యకర్తలకు చాలా పట్టుదల ఉందని దాన్ని ఎన్నికల సమయంలో వినియోగించుకుని అధికార పార్టీ వైఫల్యాలు ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో బాలత్రిపురసుందరి, మధుసూదన్‌యాదవ్, యాదయ్య, నర్సింహులు, శ్రీనివాస్, సత్యం, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటరు జాబితా సిద్ధం చేయాలి



మహమ్మదాబాద్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ మోహన్‌రావు

మహమ్మదాబాద్: ఓటరు జాబితాను పక్కాగా సిద్ధం చేయాలని రెవెన్యూ డిప్యూటీ కలెక్టర్ మోహన్‌రావు సూచించారు. గురువారం ఆయన మండలాన్ని సందర్శించారు. రెవెన్యూ అధికారులతో సమావేశమై మాట్లాడారు. ప్రాథమిక స్థాయిలో బీఎల్‌ఓలు బాధ్యతతో పనిచేసి అర్హులైన వారందరిని ఓటరు జాబితాలో చేర్చాలన్నారు. ఇప్పటికీ కొందరి పేర్లు తప్పుగా ఉండి, మరికొందరి పేర్లు జాబితాలో లేకుంటే వారికి తగిన అవగాహన కల్పించి దరఖాస్తులు పెట్టుకునేలా చూడాలన్నారు. గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలు గుర్తించి వాటి పరిధిలో ప్రజలకు అధికారులకు తగిన సౌకర్యాలు ఉండేలా సిద్ధం చేసుకోవాలన్నారు. అటవీ ప్రాంతాల్లో ఉండే గిరిజన చెంచు వారు ప్రతి ఒక్కరూ జాబితాలో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌యేసయ్య, ఆర్‌ఐ యాదయ్య, సీనియర్ అసిస్టెంట్ విజయలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

ఓటరు వినియోగంపై అవగాహన..

బాలానగర్: ఓటు హక్కు వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఈవీఎం పద్ధతి ద్వారా ఓటు హక్కు ఏ విధంగా వినియోగించుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఆన్‌లైన్ పద్ధతి ద్వారా సైతం దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

పోలింగ్ బూత్‌లో వసతులపై దృష్టి..

భూత్పూర్: పోలింగ్ బూత్‌లలో వసతులపై దృష్టి సారించాలని తహసీల్దార్ భానుకిరణ్ అన్నారు. గురువారం కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. బీఎల్‌ఓలు తమ తమ పోలింగ్ బూత్‌లను పరిశీలించి గది, విద్యుత్, మరుగుదొడ్ల నిర్వహణ తదితర విషయాలను గుర్తించి తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఓటరు నమోదు చేయించాలి..

కోయిల్‌కొండ: మండలంలోని 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని తహసీల్దార్ భరత్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు నమోదుపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

భక్తిశ్రద్ధలతో బోనాల ఊరేగింపు



నవాబుపేటలో పోచమ్మ దేవాలయంలో బోనాల ఊరేగింపు

బాలానగర్: మండల కేంద్రంతోపాటు, మండలంలోని మోతీఘణపూర్‌లో గురువారం బోనాల పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలో యావాలమ్మ బోనాల పండుగ సందర్భంగా శివసత్తుల విన్యాసాలు, పోతురాజులతో, అమ్మవారి వివిధ రూపాల వేషధారణలతో బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పాల్గొని పోతురాజుల విన్యాసాలను తిలకించారు.

ఘనంగా పోచమ్మ బోనాలు..

నవాబుపేట: మండల కేంద్రంలో గురువారం పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. గ్రామాన్ని వేపాకులతో అలంకరించారు. శివాలయం, హనుమాన్ దేవాలయాల వద్ద ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

చిన్నచింతకుంట: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శేఖర్ విద్యార్థులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అవగాహన కల్పించారు.

పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వాలి



పిల్లలను పరీక్షిస్తున్న డాక్టర్ లావణ్య

అడ్డాకుల: చిన్న పిల్లలకు తల్లిదండ్రులు తప్పకుండా పౌష్టికాహారం ఇవ్వాలని మండల ఆయుర్వేద వైద్యురాలు లావణ్య సూచించారు. మండలంలోని శాఖాపూర్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం వర్షాకాలం హెల్త్ క్యాంపులను ఆమె నిర్వహించారు.

ఇళ్ల మధ్య టవర్ ఏర్పాటు చేయొద్దు



సెల్‌టవర్ నిర్మించే ఇంటి వద్ద కాలనీ వాసులు

జడ్చర్ల: ఇళ్ల మధ్యన సెల్ టవర్ ఏర్పాటు చేయొద్దని కాలనీ వాసులు కోరారు. స్థానిక విద్యానగర్ కాలనీలో ఓ ఇంటి పై కప్పుపై సెల్ టవర్ పనులు కొనసాగిస్తున్నారని కాలనీ వాసులు పేర్కొంటూ ఆ ఇంటి వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. టవర్ వల్ల రేడియేషన్ ప్రభావంతో తాము అనారోగ్యాల పాలయ్యే పరిస్థితి ఉందని తెలిపారు. మున్సిపల్ కమిషనర్‌తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సెల్ టవర్ నిర్మాణం చేయకుండా చర్యలు తీసుకుంటామని కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డితెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పది రోజుల జైలుశిక్ష

మహబూబ్‌నగర్ క్రైం: మద్యం తాగి వాహనాలు నడిపిన వాహనదారులకు న్యాయమూర్తి జైలు శిక్షతో పాటు జరిమాన విధించారు. పట్టణ ట్రాఫిక్ పోలీసులు ఇటీవల చేపట్టిన డ్రంకెన్‌డ్రైవ్‌లో నలుగురు ద్విచక్ర వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని గురువారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి నిర్మల ఒకరికి పది రోజుల జైలు శిక్షతో పాటు రూ.3,500జరిమానా విధించగా మరో ముగ్గురికి రూ.7,500జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

దళిత గిరిజన మహాసభకు తరలివెళ్దాం

జడ్చర్ల టౌన్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 26న శనివారం చేవెళ్లలో నిర్వహించే దళిత, గిరిజన మహాసభకు పెద్దసంఖ్యలో తరలివెళ్దామని మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన గృహంలో నియోజకవర్గ పర్యవేక్షకుడు, జగిత్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్‌తో కలిసి మహాసభకు వెళ్లే ఏర్పాట్లపై సమీక్ష చేశారు. కార్యక్రమంలో బుర్ల వెంకటయ్య, జనార్దన్‌రెడ్డి, అశోక్‌యాదవ్, శ్రీను పాల్గొన్నారు.

మొబైల్‌ఫోన్ చోరీ

- పౌచ్‌లో ఉన్న ఏటీఎంతో నగదు డ్రా

మహమ్మదాబాద్: గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చోరీ చేసి పౌచ్‌లో ఉన్న ఏటీఎంను ఉపయోగించి నగదును డ్రా చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కంచన్‌పల్లి చెందిన కుర్వ వెంకటయ్య ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 4వ తేదీన గుర్తుతెలియని వ్యక్తి ఫోన్, పౌచ్‌లో ఉన్న ఏటీఎంను తస్కరించాడు. 5వ తేదీన వెంకటయ్య ఖాతా నుంచి రూ.12,870 వేరే ఖాతాకు బదిలీ చేసి డ్రా చేసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

భూత్పూర్: మండలంలోని కప్పెటవాగు నుంచి అనుమతి లేకుండా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని ఆరుగురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు గురువారం తెలిపారు. ట్రాక్టర్ యజమానులు రాంచంద్రారెడ్డి, యాదగిరి గౌడ్, వడ్డే యాదగిరి, డ్రైవర్‌లు తూము వెంకటేశ్వర్లు, అనుపటి చక్రధర్, గొర్ల ఆకాశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న రెండవ ఏఎన్‌ఎంలు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని, నోటిఫికేషన్‌ను రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక తెలంగాణచౌరస్తాలో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. రెండవ ఏఎన్ఎంల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జయమ్మ, మంజుల మాట్లాడుతూ.. 9 రోజులుగా తమ ఉద్యోగాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తుంటే ప్రభుత్వం మొండిగా నోటిఫికేషన్ జారీ చేసి పరీక్షలు రాయాలని నిబంధన పెట్టడం సరికాదన్నారు. నిరసన కార్యక్రమంలో నోటిఫికేషన్ ప్రతులను తగులబెట్టారు.

బీఆర్ఎస్‌లో చేరిక

నవాబుపేట: మండలంలోని కిషన్‌గూడకు చెందిన కాంగ్రెస్ నాయకులు గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు వెంకటేష్, చంద్రమోహన్, ఆనంద్‌తో పాటు మరో 50 మంది కార్యకర్తలను ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు.

భూత్పూర్: మండలంలోని అన్నాసాగర్‌లో గురువారం బీజేపీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు.

పేదల కోసం ఆలోచించే నాయకుడు కేసీఆర్



పింఛన్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్

భూత్పూర్: పేదల కోసం నిత్యం ఆలోచన చేసే నాయకుడు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో దివ్యాంగులు, ఆసరా పింఛన్ల లబ్ధిదారులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్ రవినాయక్, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమంలో చావు అంచుల వరకు వెళ్లి వచ్చారని, రాష్ట్రంలో ఉన్న పేద ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఇంటింటికీ కృష్ణానది నీళ్లు అందిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో రూ.902 కోట్లు రైతుబంధు ఇచ్చినట్లు పేర్కొన్నారు. 3,500 మంది దివ్యాంగులకు రూ.4016 చొప్పున పింఛన్ అందిస్తున్నామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మాభిమానంతో బ్రతకడానికి పెంచిన పింఛన్ ఉపయోగపడుతాయన్నారు. దివ్యాంగులకు గృహలక్ష్మి పథకంలో ఐదు శాతం రిజర్వేషన్ ఇచ్చినందున వారికి ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, నియోజకవర్గంలో 3,500 మందికి, జిల్లా వ్యాప్తంగా 13,773 మంది దివ్యాంగుల కుటుంబాలకు పింఛన్ పెంపు వెలుగు నింపిందని కలెక్టర్ అన్నారు.

అఫిడవిట్ పేరిట మంత్రిపై దుష్ప్రచారం



మాట్లాడుతున్న న్యాయవాదులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ లీగల్ సెల్ అధ్యక్షుడు విక్రమ్‌దేవ్ ధ్వజమెత్తారు. గురువారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. నాలుగేళ్లుగా నిశబ్ధంగా ఉండి ఇప్పుడు తప్పడు అఫిడవిట్ అంటూ దుష్ప్రచారం చేస్తున్నారని, 2018కి సంబంధించిన కేసు విషయంలో కావాలని ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. అఫిడవిట్ అంశంలో అవకతవకలు కాలేదని, కేంద్ర ఎన్నికల సంఘమే క్లీన్ చిట్ ఇచ్చినా, కుట్రదారులు ఆ అంశాన్ని దాచిపెట్టి మళ్లీ కోర్టు మెట్లు ఎక్కుతున్నారని అన్నారు. సోషల్‌మీడియాలో శిక్ష ఖాయమంటూ తీర్పులు ఇస్తు తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై న్యాయపరంగా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

దేవరకద్ర నుంచి జీఎంఆర్ దరఖాస్తు

దేవరకద్ర: డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టికెట్ కోసం గురువారం హైదరాబాద్ గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో ముగ్గురు నాయకులు దరఖాస్తు చేసుకున్న సంగతి తెలిసిందే. కాంగ్రెస్ టికెట్ కోసం పోటీ ఎక్కువ కావడంతో చివరికి ఎవరికి వరిస్తుందో వేచి చూడాలి.